క్లుప్తంగా

వైభవంగా లక్ష చామంతి పూజ

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీకామాక్షీ పీఠం మహా సంస్థానంలో మూడు రోజుల కిందట మొదలైన ఉగాది మహోత్సవాలు పీఠంలోని శ్రీకామాక్షీ అమ్మకు సోమవారం నిర్వహించిన లక్ష చామంతి పూజతో ముగిశాయి. వందలాది మంది మహిళలు సమక్షంలో పీఠాధిపతి కామేశ మహర్షి పర్యవేక్షణలో పీఠం ఉత్తరాధికారి, బాల బ్రహ్మచారి విఘసన రాఖీ ప్రేమ్, పీఠం బ్రహ్మ గోవిందవర్జుల నాగుబాబు ఆధ్వర్యంలో లక్ష చామంతి పూజ నిర్వహించారు. పీఠం ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, పీఠం మేనేజర్ మల్రి దుర్గారావు పాల్గొన్నారు.

ఘనంగా మాణిక్యాంబ తీర్థం

ఐ.పోలవరం: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి మాణిక్యాంబ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, కోలాటాలు, మన్యం నృత్యాలు, తీన్‌మార్, విచిత్ర వేషధారణలు భక్తులను ఆకట్టుకొన్నాయి. వేకువజామున 2గంటలకు జాతీయ రహదారి 216పై ఏర్పాటు చేసిన నిప్పుల గుండం చూసేందుకు భక్తులు తరలివచ్చారు. మహాశివరాత్రి మరుసటి రోజు నుంచి నెల రోజుల పాటు అమ్మవారి ఆలయంలో రాత్రి పూట జాతర నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

శివపంచాయతన యాగం ప్రారంభం

అల్లవరం: దేవగుప్తంలో ఉమా పార్వతి సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మరువాడ వెంకటేశ్వర శర్మ, పోచినపెద్ది శ్యామ్ శర్మ ఆధ్వర్యంలో నక్షత్ర పూర్వక నవగ్రహ సహిత శివ పంచాయతన యాగాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఐదు రోజుల పాటు ఈ యాగం కొనసాగనుంది. తొలి రోజున గణపతి పూజ, మండపారాధన, కలశస్థాపన, మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, సూర్య నమస్కారాలు, కుంకుమ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సోమవారం అష్టోత్తర కలశాభిషేకం, పత్రి పూజ, 27 నక్షత్రాలకు నవగ్రహ పూజ నిర్వహించనున్నట్టు శ్యామ్ శర్మ తెలిపారు.

సరిపల్లిలో నేత్ర వైద్య పరీక్షలు

ఉప్పలగుప్తం: సరిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం జేఎస్‌డీ రాజు చారిటబుల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గెద్దం స్వరూపరాణి ప్రారంభించారు.శిబిరంలో డాక్టర్ ఆర్.తేజస్విని సుమారు 100 మందికి నేత్ర పరీక్షలు చేసి మందులు అందజేశారు.అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గెద్దం సురేష్ బాబు,జేఎస్‌డీ రాజు, పి.వెంకటేష్, సీహెచ్.చిట్టిబాబు, ఎస్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

వయోలిన్ విద్వాంసుడికి సత్కారం

తాళ్లరేవు: ఇంజరం గ్రామానికి చెందిన వయోలిన్ విద్వాంసుడు, యానాం బాలభవన్ సంగీత ఉపాధ్యాయుడు మహేంద్రవాడ సరసింహమూర్తి (బుజ్జి) మాస్టారును సోమవారం ఘనంగా సత్కరించారు. ఇంజరం షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కాకరపర్తి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఓలేటి వెంకట రమణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బుజ్జి మాస్టారు దంపతులను ఘనంగా సత్కరించారు. మాస్టారుకు వాయులీన విద్వాన్‌మణి బిరుదు పురస్కారాన్ని ప్రదానం చేసారు. సంగీత సర స్వతి అవార్డు గ్రహీత పెద్దాడ సూర్యకుమారి, సర్పంచ్ ముద్దన ప్రసాద్, పండితులు పాల్గొన్నారు.

యోగా సాధనలో ఆరోగ్యం

యానాం: యోగాసనాలు శరీరానికి దృఢత్వాన్ని కలిగిస్తాయని, ఆరోగ్యరక్షణకు దోహదపడతాయని అధ్యాపకులు డాక్టర్ జయవీరన్ పేర్కొన్నారు. సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రత్యేక సేవాశిబిరంలో యోగాసనాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ వాసంశెట్టి ఆనంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'నడక సింహాసనం' పుస్తకం ఆవిష్కరణ

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన నడక కవి నల్లా నరసింహమూర్తి రచించిన 100వ నడక నానీల కవితా సంపుటి 'నడక సింహాసనం' ద్వితీయ ముద్రణ పుస్తకాన్ని ఎంపీ గంటి హరీష్ మాథుర్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. దాదాపు 25 ఏళ్లుగా ప్రజలకు ఆరోగ్య సూత్రాలను చిన్న కవితల రూపంలో చైతన్య పరుస్తున్న నడక కవి నరసింహమూర్తి సాహితీ సేవలు అభినందనీయమని ఎంపీ హరీష్ పేర్కొన్నారు. కోనసీమ రయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ సభ్యురాలు, అంగన్‌వాడీల రాష్ట్ర సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ మెండి కమల, ముత్తాబత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడికి ఘన సత్కారం

యానాం: యానాం పబ్లిక్ సర్వెంట్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికైన హంసాని రామలక్ష్మణుడిని సోమవారం కనకాలపేట గ్రామస్తులు, మిత్రులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో తోట భైరవస్వామి, కోన రామచంద్రరావు, కోన గణపతి తదితరులు పాల్గొన్నారు.

పైరవీలకు తెరతీసిన కూటమి నేతలు

- కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల వెల్లువ
- యూనిట్ ధర రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు
- ప్రతి యూనిట్‌కు 20 మంది పైగా అభ్యర్థుల పోటీ
- కోటలు దాటుతున్న నేతల హామీలు

అల్లవరం: ఇటీవల కార్పొరేషన్ రుణాలకు ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడిన నాటి నుంచి కూటమి నేతలు గ్రామాల్లో హడావుడి చేస్తున్నారు. దరఖాస్తు చేస్తే చాలు రుణం మంజూరవుతుంది, మీరు దరఖాస్తు చేయండి చాలు, మేము చూస్తుకుంటామంటూ నాయకుల హామీలు కోటలు దాటుతున్నాయి.

కూటమి నేతల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణ

సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం బ్యాంక్ అధికారులు సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. బ్యాంక్‌లకు కేటాయించిన రుణాలకు ఆయా బ్యాంక్ అధికారులు అభ్యర్థులను ఎంపిక చేసి రుణాలు మంజూరు చేయవలసి ఉంది. అయితే అభ్యర్థులు మాత్రం కూటమి నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. కార్పొరేషన్ రుణం మంజూరు చేయించాలంటూ కూటమి నేతల ఇళ్ల చుట్టూ దరఖాస్తుదారులు తిరుగుతున్నారు. దీనిని సాకుగా తీసుకుని కొంత మంది కూటమి నేతలు పైరవీలు సాగిస్తున్నారు.

వందల్లో యూనిట్లు, వేలల్లో దరఖాస్తులు

ఎస్సీ, బీసీ, కాపు, బ్రహ్మణ, ఆర్య వైశ్య, రెడ్డి, కమ్మ, ఈబీసీ తదితర కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనకబడిన వారికి స్వయం ఉపాధి పొందేందుకు సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. కనిష్ఠంగా రూ.2 లక్షలు నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు ప్రకటించారు. ప్రకటన విడుదలైన నాటి నుంచి మీ సేవ కేంద్రాలు అభ్యర్థులతో కిటకిటలాడాయి. కార్పొరేషన్ రుణం వస్తే చిన్న వ్యాపారం ప్రారంభించుకోవచ్చనుకున్న అభ్యర్థుల ఆశపై కూటమి ప్రభుత్వం దెబ్బ కొట్టింది. అభ్యర్థులు వేలల్లో ఉంటే యూనిట్లు కనీసం వందల్లో కూడా లేవు. దీంతో అభ్యర్థుల ఆశపై కూటమి ప్రభుత్వం నీళ్ళు చల్లింది. బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ రుణాలకు అభ్యర్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు దరఖాస్తులు నమోదుకు ఆన్‌లైన్లో అవకాశం ఇవ్వలేదు. ప్రస్తుతం బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు శుక్ర, శనివారాల్లో అభ్యర్థుల వయస్సు, కులం, విద్యార్హతకు సంబంధించి సరిఫికెట్ల పరిశీలన నిర్వహించారు.



అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో కార్పొరేషన్ రుణాలకు సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న అధికారులు

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుదారుల వివరాలు

అల్లవరం మండలంలో బీసీలు 35 మంది, కాపులు 25, బ్రాహ్మణులు 1, కమ్మ 1, ఇతర కులాల వారు 1,274 మంది దరఖాస్తు అందించి, వారిలో సర్టిఫికెట్ల పరిశీలనకు 1,033 మంది హాజరయ్యారు. ఉప్పలగుప్తం మండలంలో బీసీలు 35 మంది, కాపులు 34, ఇతర కులాల వారు 1,295 మంది దరఖాస్తు అందజేసి, వారిలో 1,150 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు.

అమలాపురం రూరల్ మండలంలో బీసీలు 39, కాపు 33, బ్రాహ్మణ, కమ్మ, ఇతర కులాలవారు 9మంది, మొత్తం 2,689 మంది దరఖాస్తులు అందజేసి వారిలో సర్టిఫికెట్ల పరిశీలనకు 2,510 మంది హాజరయ్యారు.అమలాపురం టౌన్ పరిధిలో ఆర్య వైశ్యులు 1, బ్రాహ్మణ 2, ఈబీసీ 1, కమ్మ 3, క్షత్రియ 1, రెడ్డి 1 మంది దరఖాస్తులు అందజేశారు.



సరిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన నిర్వహించాం. అభ్యర్థి వయస్సు, కులం, విద్యార్హత పరిశీలించాము. సరిఫికెట్ల పరిశీలన అనంతరం బ్యాంక్ అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తాం.

– టీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్, ఎంపీడీఓ, అల్లవరం

సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.

ప్యాసింజర్ బోగీలను పెంచాలి

అమలాపురం టౌన్: రైల్వే శాఖ నడుపుతున్న రైళ్లకు ప్యాసింజర్ బోగీలను పెంచాలని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. రైళ్లకు కేవలం మూడు బోగీలను మాత్రమే ఆ శాఖ సమకూర్చుతోందని, దీని వల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లే సాధారణ ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. రైల్వే శాఖ స్పందించి రాష్ట్రం మీదుగా ప్రయాణించే రైళ్లకు ప్యాసింజర్ బోగీలు పెంచాలని స్పష్టం చేశారు. కోటిపల్లి-నర్సాపురం మధ్య కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పితాని బేబీరావు, కొనుకు వెంకటేశ్వరరావు, సాధనాల రామకృష్ణ పాల్గొన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడికి సత్కారం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న అసోసియేసన్ సభ్యులు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా పౌరసఫరాల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు, జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావును బాబూ జగ్జీవన్ రామ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేసన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. నడిపూడిలో బాబూజగ్జీవన్ కమ్యూనిటీ హాలులో సోమవారం నిర్వహించిన సమావేశంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎంప్లాయీస్ అసోసియేసన్ అధ్యక్ష, కార్యదర్శులు మడికి సత్యనారాయణ, తెన్నేటి రాజబాబు అధ్వర్యంలో నాగేశ్వరరావును సత్కరించారు. సంఘం సభ్యులు నొండ్రు వాడపల్లి, కొరుకూరి కృపావరం, నొండ్రు లక్ష్మణరావు, వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాపు నాగభూషణం, కార్యదర్శి చేట్ల సత్యనారాయణ, డైరెక్టర్లు తదితరులు సత్కరించారు.

ఎస్సై రామకృష్ణ సేవలు అభినందనీయం

అమలాపురం టౌన్: దాదాపు 40 ఏళ్లకు పైగా జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకూ తన విధులను అంకితభావంతో నిర్వర్తించిన ఎస్సై రామకృష్ణ అభినందనీయుడని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయం డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో (డీటీఆర్‌బీ) విభాగంలో ఎస్సైగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన గుబ్బల బాలవీరవెంకటరామకృష్ణకు స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వీడ్కోలు సభకు ఎస్పీ కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్పీ కార్యాలయం మిగిలిన విభాగాల సీఐలు మాట్లాడుతూ రామకృష్ణ కొన్నేళ్ల పాటు ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేయడం వల్ల నేటికీ ఆయన పేరు ఇంటిలిజెన్స్ రామకృష్ణగా స్థిరపడిందని గుర్తు చేశారు. కానిస్టేబుల్ నుంచి పదోన్నతులతో నేడు ఎస్సై స్థాయికి చేరుకుని ఎక్కడా ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్సై రామకృష్ణ సేవ పతకం, ఉత్తమ సేవా పతకాలు సాధించడమే ఆయన పని తీరుకు తార్కాణమని పేర్కొన్నారు. అనంతరం రామకృష్ణ, అనురాధ దంపతులను ఎస్పీ కృష్ణారావు జిల్లా పోలీస్ శాఖ తరుపున ఘనంగా సత్కరించారు. పలువురు సీఐలు, ఎస్సైలు, పట్టణ ప్రముఖులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాస్, జిల్లా ఆర్మ్‌డ్ ఆర్ఐ బ్రహ్మానందం పాల్గొన్నారు.



ఎస్సై రామకృష్ణ దంపతులను సత్కరించిన జిల్లా ఎస్పీ కృష్ణారావు, సీఐలు

ఉప్పునీటి చెరువుల తవ్వకాలు నిలిపివేయండి

కాట్రేనికోన: పల్లంకుర్రు శివారు లైనుపేటలో పంట భూమిలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా తవ్వుతున్న ఉప్పు నీటి చెరువులను తక్షణమే నిలిపివేయాలని సరిహద్దు రైతులు గ్రీవెన్సు సెల్‌లో ఫిర్యాదు చేసారు. పల్లకుర్రు పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 995, 995/1, 995/2, 995/3 సంగాని రామకృష్ణ భవన్నారాయణ, సంగాని చిరంజీవి సత్తిరాజు, సంగాని వాసుదేవేంద్రరావుకు 4.5 ఎకరాల పంట భూమి ఉందన్నారు. అనధికారికంగా తవ్వుతున్న ఉప్పు నీటి రొయ్యల చెరువులతో సమీపంలోని పంట చేలు దెబ్బతింటాయని, ప్రభుత్వం స్పందించి చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని రైతు రామకృష్ణంరాజు గ్రీవెన్సులో ఫిర్యాదు చేసారు.

ఎస్సీ ఉద్యోగులపై వివక్ష తగదు

అమలాపురం రూరల్: సచివాలయాల్లో పని చేస్తున్న ఎస్సీ ఉద్యోగులపై ప్రభుత్వ వివక్ష తగదని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు అన్నారు. సోమవారం అమలాపురం మండలం నడిపూడిలో ఈదరపల్లి డాబా గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన అత్యవసర జిల్లా సమావేశంలో నకుల రాజు మాట్లాడుతూ అమరావతిలో పీ-4 ప్రారంభోత్సవానికి సంబంధించి 130 మంది ఎస్సీ ఉద్యోగులకు సెలవు దినాల్లో డ్యూటీలు వేయడం దుర్మార్గమని అన్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులను పీ-4 కార్యక్రమానికి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రధాన కార్యదర్శి గోసంగి బంగ్రారాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నేరేడిమిల్లి సత్యనారాయణ, భయ్యా మోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు గెద్దం ప్రదీప్, మంగం సుధాకర్, ఉప్పే నరసింహారావు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే నిరాహార దీక్ష

యానాం: మెట్టకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలోని ప్రభుత్వ స్థలంలో డంపింగ్‌యార్డు రిసోర్స్ రికవరీ పార్క్‌ను పెట్టబోమని ఈ మేరకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని గతంలో పుదుచ్చేరి ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ సమీప గోపాల్‌నగర్ ప్రజలతో నిరాహార దీక్ష చేయించడం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు రాజకీయ ప్రయోజనాల కోసమేనని స్పష్టమవుతోందని ఆదివారం మండపాక సత్తిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో డంపింగ్‌యార్డు పెట్టడంపై అప్పట్లో విద్యుత్ శాఖ, అధికారులు అభ్యంతరం తెలుపుతూ అప్పట్లో సూపరింటెండెంట్ ఇంజనీరు పుదుచ్చేరి వారికి నివేదిక పంపారని దీంతో పుదుచ్చేరి ప్రభుత్వం ఆ ప్రతిపాదనను విరమించుకుంటున్నట్లు తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం మరో రెండు స్థలాలను పరిశీలిస్తున్నట్లు ఎన్‌జీటీకి తెలిపిందని, దీంతో విచారణను జూన్ 3కు వాయిదా వేసిందన్నారు. అయినప్పటికీ మల్లాడి కృష్ణారావు దీక్షలు చేయించడంతోపాటు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌పై ఈ ఘటన ద్వారా బురద చల్లడానికేనని తెలిపారు. యానాం ప్రజలను పక్కదోవ పట్టించి తద్వారా డంపింగ్ యార్డు స్థల ఎంపిక ప్రక్రియ మరింత ఆలస్యమయ్యేలా ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు.

కుళాయి నుంచి కలుషిత నీరు సరఫరా

ఉప్పలగుప్తం: సరిపల్లిలో పంచాయతీ కుళాయి నుంచి సోమవారం కలుషితమైన మురికి నీరుసరఫరా కావడంతో గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని రోజులుగా ఈ సమస్య ఉందని, ఈ మురికి నీటి సమస్యను త్వరితగతిన అధికారులు పరిష్కరించాలని బీఎస్పీ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్, వైఎస్సార్ సీపీ మండల సెక్రటరీ కోరుకొండ కిరణ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్‌ను వివరణ కోరగా గ్రామంలో కొన్ని చోట్ల పైప్‌లైన్లకు లీకులున్నాయని, వాటిని సరిచేయడంపై పంచాయతీ కార్యదర్శితో చర్చించినట్టు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తాళ్లరేవు: ఇంజరం చోడవరపు అప్పన్న మెమోరియల్ హైస్కూల్లో 1994-95లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులందరూ సుమారు 30 ఏళ్ల అనంతరం సోమవారం కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుని బాల్య స్మృతులను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో మునిగి తేలారు. తోటి స్నేహితులతో కలసి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేసారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు గుబ్బల రామస్వామి, రాకుదిటి ఆచార్యులు, దాట్ల దేవదానం రాజు, పట్నాల రామారావు, పట్నాల లక్ష్మణరావును ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. సర్పంచ్ ముద్దన వెంకట వెంకటశివరామప్రసాద్, మట్టపర్తి శ్రీనివాసరావు, చింతలపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజరం హైస్కూల్లో కలుసుకున్న 1994-95 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

ఘనంగా తాడి తాతారావు జయంతి

ముమ్మిడివరం: ప్రముఖ పారిశ్రామిక వేత్త, సినీ నిర్మాత దివంగత తాడి తాతారావు 74వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీటీఆర్ నగర్‌లో తాడి తాతారావు ఘాట్లో ఆయన కుమారులు తాడి నరసింహరావు, జానకీరామ్, కుమార్తె అల్లాడి రమణికుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తాతారావు విగ్రహానికి పూలామలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాడి నాగేశ్వరరావు, పెద నరసింహరావు, కాశి విశ్వేశ్వరరావు, పాయసం చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం ఏఓగా తులసీకృష్ణ

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల పరిషత్ పరిపాలనాధికారి (ఏఓ)గా బీహెచ్ తులసీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్వపు పరిపాలనాధికారి ఎన్.శ్రీనివాస్ కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏఓగా బదిలీపై వెళ్లారు.

రాజేష్ మృతి బాధాకరం

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయిచెరువుకు చెందిన మధుర రాజేష్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై ఆకస్మికంగా మృతి చెందగా ఆ కుటుంబాన్ని సోమవారం పలువురు నాయకులు పరామర్శించారు. అమలాపురం నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు, అమలాపురం నియోజకవర్గం బీఎస్పీ ఇన్‌చార్జ్ పాలమూరి మోహన్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, మాజీ జెడ్పీటీసీ పెయ్యిల విష్ణుమూర్తి, మాజీ సర్పంచ్ తొత్తరమూడి నరసింహమూర్తి, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, పందిరి సుబ్బరాజు, గంటా లక్ష్మీ వరప్రసాద్, జత్తుక సత్యనారాయణ పరామర్శించి రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేష్ చిన్నవయస్సులో ఆకస్మిక మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. రాజేష్ తండ్రి నరసింహమూర్తి, కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపి ఓదార్చారు.

ఆనందీబాయి జోషి చిరస్మరణీయం

అమలాపురం టౌన్: భారతీయ మొట్ట మొదటి మహిళా వైద్యురాలు ఆనందీబాయి జోషి జయంతిని అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు స్థానిక గోఖలే వీధిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి గోటేటి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ జయంతి సభలో క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ పాశ్చాత్య వైద్యంలో పట్టా పొందిన మొట్టమొదటి మహిళా వైద్యురాలిగా ఆనందీబాయి జోషి పేద ప్రజలకు ఎంతో వైద్య సేవలందించారని చెప్పారు. ఆనందీబాయి జోషి సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి మహిళా వాకర్స్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, క్లబ్ మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, జిల్లా వాకర్స్ బులిటన్ ఎడిటర్ పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు పాల్గొని ఆనందబాయి జోషి వైద్య సేవలను కొనియాడారు.



ఆనందబాయి జోషి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

కాట్రేనికోన: బలుసుతిప్ప గ్రామానికి చెందిన సంగాని వెంకటేష్ అతని అనుచరులు కులంపేరుతో దూషించి తనపై దాడి చేసారని, అదే గ్రామానికి చెందిన నిమ్మితి నాగరాజు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధితుడు నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం బ్రహ్మ సమేధ్యం పంచాయతీకి చెందిన మంచి నీటి ట్యాంకులను సర్పంచి ఆదేశాలతో శుభ్రం చేస్తుండగా సంగాని వెంకటేష్‌తో పాటు మరి కొందరు వచ్చి కులంపేరుతో దూషించి దాడి చేసారన్నారు. సుమారు 40 మంది గ్రామస్తుల సమక్షంలో తనపై దాడి చేసి, కులంపేరుతో దూషించారని నాగరాజు ఆరోపించారు. దాడికి పాల్పడిన నిందితులుపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రక్త పింజరి కాటు ప్రమాదకరం

అమలాపురం రూరల్: కోనసీమ ప్రాంతంలో రక్త పింజరి పాముల సంచారం పెరిగిందని, ఈ పాము కాటు ప్రమాదకరమని, ప్రజలు, పొలాల్లో ఉండే రైతులు అప్రమత్తంగా ఉండాలని స్నేక్ క్యాచర్ గణేష్ వర్మ సూచించారు. అమలాపురం రూరల్ మండలం తొట్లపాలెంలో ఆయన సోమవారం మాట్లాడుతూ తొట్లపాలెం రైతుకు చెందిన ఆరు నెలల గర్భంతో ఉన్న ఆవు రక్త పింజరి కాటుకు గురై మృతి చెందిందని తెలిపారు. గత వారం పాము కాటుతో జిల్లాలో ముమ్మిడివరం, మామిడికుదురు మండలాల్లో ఇద్దరు మృతి చెందారని తెలిపారు. వేసవి నేపథ్యంలో పాముల సంచారం అధికంగా ఉంటుందని అన్నారు. పాము కనిపిస్తే చంపకుండా తనకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

డాక్టర్ సర్వేశ్వరశర్మకు ఉగాది పురస్కారం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వర శర్మకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉగాది పురస్కారాన్ని సీఎం చంద్రబాబు ప్రదానం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఉగాది పర్వ దినాన ఈ పురస్కారాన్ని అందుకున్నట్టు సోమవారం అమలాపురంలో డాక్టర్ సర్వేశ్వరశర్మ తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు నాగూర్ ఎంపిక

యానాం: మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో నిర్వహించనున్న 68వ జాతీయస్థాయి స్కూల్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు పుదుచ్చేరి రాష్ట్రం తరపున యానాం శారదా ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్‌కు చెందిన తిరుమాడి నాగూర్ ఎంపికైనట్లు సోమవారం ప్రధానోపాధ్యాయుడు చిక్కాల వెంకటేశ్వరరావు తెలిపారు. బాలుర అండర్-17 కేటగిరిలో నిర్వహించే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నాగూర్ ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ చింతా వెంకన్న, కోచ్‌లు, టీచర్లు పాల్గొన్నారు.

ప్రవక్త బోధించిన మార్గాన్ని అనుసరించాలి

ముమ్మిడివరం: రంజాన్ నెల చివరి రోజులో భాగంగా సోమవారం ఈద్ ఉల్ ఫితర్ నమాజీలు ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. స్థానిక గొల్లగూడెంలో షియా మతస్తులకు చెందిన మసీద్ జహారా, సున్ని జామియా మసీదు వద్ద ముస్లింలు నమాజులను చదివారు. అనంతరం ఒకరినొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలు, పొరుగు వారి పట్ల ప్రేమ, దయా గుణంతో మెలగాలని, దాన ధర్మాలు చేయాలని, ప్రవక్త బోధించిన మార్గాలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా అనుసరించాలని ఢిల్లీ నుంచి విచ్చేసిన మౌలానా సయ్యద్ తాజీమ్ అబ్బాస్ రిజ్వి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాజిమ్ హుస్సేన్, పేంటు సాహెబ్, అలీ అక్బర్, సాధక్ హుస్సేన్, గజంఫర్, హుస్సేన్, సయిద్ అలీ, గులే హసన్, హైదర్ అబ్బాస్, సాబు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం ముల్లా ముస్తాఫా మసీదులో రంజాన్ వేడుకలలో పాల్గొన్న ముస్లింలు

ఈద్ ముబారక్‌తో రంజాన్ వేడుకలు

అమలాపురం టౌన్: రంజాన్ పవిత్ర మాసంలో ఉప వాస దీక్షలు పాటించిన అమలాపురంలోని ముస్లింలు రంజాన్ పర్వ దినాన సోమవారం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక ముల్లా ముస్తాఫా, జామియా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం రంజాన్ ముగింపు వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ముస్లిం పెద్దలు ఎండీ అమీర్, షేక్ అబ్దుల్ ఖాదర్, ఎండీ ఆజామ్, ఎండీ బషీర్, ఎంకే మొహిద్దీన్, వలీ, షరీఫ్, షఫీ, ఫిరోజ్, ఖాన్షా పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

యానాంలో వేడుకలు

యానాం: రంజాన్ ఉపవాస దీక్షలు ముగియడంతో యానాంలో ముస్లిం సోదరులు ఈదుల్ ఫితర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చారిత్రక జామియా మసీదు, మసీదే కూబా వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జామియా, మసీదా కూబా ఇమామ్‌లు మహ్మద్ ఎజ్ఞానీ, మహ్మద్ రఫీ మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమని పేర్కొన్నారు. దేశ ప్రజల శాంతి సౌభాగ్యాల కోసం దైవప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం పెద్దలు ఎండీ కాలేషా, తాజుద్దీన్‌బాషా, ఎస్‌కేఎమ్ జిలానీ, ఎండీ సుభానీ, కరీమ్, జిలానీ, బిస్మిల్లా యూత్ సభ్యులు పాల్గొన్నారు.